# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ త్వరలో విడుదల చేస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.
- ❖ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసే వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.
- ❖ శాసన సభలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కాగ్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు ప్రవేశపెట్టింది.
- ❖ గిరిజన గ్రామాలలో 2,500 కోట్ల రూపాయలతో రహదారులను నిర్మిస్తున్నామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి శాసనసభకు తెలిపారు.
- ❖ అల్పపీడన ప్రభావంతో దక్షిణ కోస్తా జిల్లాలలో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది.

========================

త్వరలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. దీని ద్వారా 16 వేల పైచిలుకు పోస్టులు భర్తీ చేస్తామని ఆయన ఈ రోజు శాసనసభలో ప్రకటించారు. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ వచ్చే సంవత్సరం భర్తీ చేస్తామని ప్రశ్నోత్తరాలు సందర్భంగా మంత్రి సమాధానం ఇచ్చారు. ఇదిలా ఉండగా వచ్చే రెండు సంవత్సరాల్లో రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయం పూర్తిచేస్తామని లోకేష్ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

========================

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసే వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. అమరావతిలో ఈ రోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... అసత్య అనుచిత పోస్టింగులు పెట్టే వారిని ఉపేక్షించేది లేదన్నారు. సామాజిక మధ్యమాలలో కొంతమంది పెడుతున్న పోస్టులు దారుణంగా ఉన్నాయన్నారు. ఆఖరికి న్యాయమూర్తుల మీద కూడా పోస్టులు పెడుతున్నారని, ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఆమె తెలిపారు. చట్ట ప్రకారం బాధ్యులపైన చర్యలు ఉంటాయని హోం మంత్రి పేర్కొన్నారు.

=========================

రాష్ట్ర శాసన సభలో ఈ రోజు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ (కాగ్) నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గత ప్రభుత్వ పాలనలో జరిగిన ఆర్థిక వ్యవహారాలను కాగ్ నివేదికలో పొందుపరచారు. 2023-24లో రూపాయిలో 52 పైసలు పన్ను వసూళ్ల ద్వారా వచ్చాయని ఆ నివేదిక పేర్కొంది. రూపాయిలో 30 పైసలు రుణాల ద్వారా తెచ్చారని కాగ్ నివేదిక వెల్లడించింది. 2023-24లో రాష్ట్ర సొంతపన్ను ఆదాయం 922 కోట్ల రూపాయలుగా ఆ నివేదిక వెల్లడిచింది.

=========================

రాష్ట్రంలోని రెండు వేల గిరిజన గ్రామాలలో 2,500 కోట్ల రూపాయలతో రహదారులు నిర్మిస్తున్నామని మహిళ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఈరోజు జరిగిన శాసన సభ సమావేశాలలో మంత్రి మాట్లాడుతూ... గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రహదారుల ఏర్పాటుతో డోలి మోతలు లేకుండా చూస్తామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 18 సెకన్లు)

=========================

మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ), లోకాయుక్త కమిషన్ లను అమరావతి నుంచి తరలింపు అంశంపై దాఖలైన పిటీషన్ల మీద రాష్ట్ర హైకోర్టులో ఈ రోజు విచారణ జరిగింది. హెచ్ఆర్సీ, లోకాయుక్త కమిషన్ లను అమరావతిలోనే ఉంచుతామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు స్పష్టం చేసింది. ఆయా సంస్థలను అమరావతిలోనే కొనసాగించేందుకు వీలుగా చట్టసవరణ చేస్తామని కూడా పేర్కొంది. తదుపరి విచారణను హైకోర్టు 3 నెలలకు వాయిదా వేసింది.

=========================

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో 15 శాతం అప్పులుమాత్రమే పెరిగాయని ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం అప్పులు చేసిందని వచ్చిన విమర్శలు సహేతికం కావన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

=========================

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని అనకాపల్లి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా కోరారు. అనకాపల్లి జిల్లాలోని ఒక ప్రైవేట్ విద్యా సంస్థలో ఈ రోజు నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గంజాయి ఇతర మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా జిల్లా పోలీసులు “సంకల్పం” కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు సహకరించాలని యువతకు పిలుపునిచ్చారు.

విరామం

========================

విశాఖ జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన - ఎన్టీఆర్ నగరాల లేఅవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. పద్మనాభం మండలం నర్సాపురం గ్రామంలోని లేఅవుట్ ను ఈ రోజు సందర్శించి నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. అప్రోచ్ రోడ్లు, డ్రెయిన్లు, ఇళ్ల నిర్మాణాల పనులను పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు.

========================

జాతీయ రహదారి 16వ నెంబర్ లోని రాజమహేంద్రవరం నుంచి అనకాపల్లి వరకు ఉన్న నాలుగు వరుసల రహదారిని ఆరు వరసల రహదారిగా చేయడానికి, అలాగే, జాతీయ రహదారి 40 లోని రాయచోటి - కడప రహదారిలో నాలుగు వరసలుగా టన్నెల్ తో కూడిన రహదారి నిర్మాణానికి అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు కేంద్ర ప్రభుత్వానికి పంపించిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఈ విషయం తెలియచేస్తూ.. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లేఖ రాసారని సి.ఎం.రమేష్ తెలిపారు.

========================

నైరుతి బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో దక్షిణ కోస్తా జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర వెల్లడించింది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారిణి తెలియజేస్తూ....

(వాయిస్ 25 సెకన్లు)

========================

రాష్ట్రంలో అక్రమంగా సాగుతున్న గంజాయి సాగుని అరికట్టడానికి ప్రభుత్వం డ్రోన్ సాంకేతికతను ఉపయోగించుకుంటుందని అధికార వర్గాలు వెల్లడించాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో డ్రోన్లతో గంజాయి సాగును అరికట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లుగా పేర్కొనాయి. ఇప్పటికే అనకాపల్లి జిల్లాలో 3.55 ఎకరాలలో డ్రోన్ల సాయంతో గంజాయి సాగును అధికారులు ధ్వంసం చేశారని తెలిపాయి. కాగా, మూడు అడుగులు ఎత్తు పెరిగిన గంజాయి మొక్కలను సైతం కనుగొనేలా హై డెఫనీషన్ చిత్రాలను తీసే మల్టీ స్పెక్టరల్ కెమేరాలను డ్రోన్లతో అనుసంధానించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నాయి. అదే విధంగా గంజాయి మొక్కలను గుర్తించేందుకు నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ), గూగుల్ సహాయాన్ని కూడా ప్రభుత్వం తీసుకుంటుందని అధికార వర్గాలు వెల్లడించాయి.

========================

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ కోటా శాసనమండలి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వ హించడానికి సహకరించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. అమలాపురం కలెక్టరేట్ లో ఈ రోజు జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈనెల 11వ తేదీన టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ అయిందని, నామినేషన్లు స్వీకరణకు చివరి తేదీ ఈ నెల 18 ఉందన్నారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ఈ నెల 19న ఉంటుందని, అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరణకు ఈ నెల 21 చివరి తేదీ అని తెలిపారు. డిసెంబర్ 5వ తేదీన ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని కలెక్టర్ తెలియజేశారు.

========================

సుస్థిర అభివృద్ధికి సహకార సంస్థల పాత్ర కీలకమని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. రేపటి నుండి ఈ నెల 20వ తేదీ వరకూ సహకార వారోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆయన తెలిపారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలకు సంబంధించిన ప్రచార గోడ పత్రికను కలెక్టర్ ఈరోజు ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సహకార సమృద్ధి యోజన ద్వారా ఇప్పటికే పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

=========================

"బాలల దినోత్సవం" సందర్భంగా రేపటి నుండి వారం రోజుల పాటు ప్రకాశం జిల్లా వ్యాప్తంగా బాలల బంగారు ఉత్సవాల పేరిట కార్యక్రమాలు నిర్వహించనున్నామని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారి తెలిపారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, వివిధ కళాశాల ప్రతినిధులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ.... బాలల దినోత్సవమైన ఈ నెల 14వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో బాల్యవివాహ రహిత ప్రకాశం పేరుతో ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేయనున్నామని తెలిపారు.

=========================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి సంబంధించి ఆఫ్ లైన్ టికెట్ల కేటాయింపు ప్రక్రియను మరింత సులభతరం చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అదనపు కార్యనిర్వహణాధికారి సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలియజేశారు. తిరుమలలో గోకులం సమావేశ మందిరం వెనుక వైపు దర్శన టికెట్ల నూతన కౌంటర్ ను ఆయన ఈ రోజు ప్రారంభించారు.

=========================

=========================